క్లుప్తంగా

150 మందికి వైద్య పరీక్షలు


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నె గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ఆసం మధుసూదన్ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. నంద్యాల శాంతిరాం ఆస్పత్రి వైద్యులు ఆకాష్, మౌనిక గ్రామానికి చెందిన 150 మందికి బీపీ, షుగర్, గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


తిమ్మయ్య(ఫైల్)

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తిమ్మయ్య(35) మంగళవారం మృతి చెందాడు. 2008 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి లివల్ కేన్సర్‌తో బాధపడుతున్నారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఏపీఓ శ్రీవిద్య, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

వీఆర్‌ఏ మృతి


కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వీఆర్‌ఏలు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె వీఆర్‌ఏ తలారి చిన్నమద్దిలేటి (43) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. గ్రామ సేవకుల సంఘం మండల అధ్యక్షుడు బాలుడు, పలువురు వీఆర్‌ఏలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీఆర్‌ఏల సంఘం తరుపున మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. సంఘం నాయకులు హరి, సుబ్రమణ్యం, మధుప్రసాద్, గోపాల్, రవి, నారాయణ, సుబ్బలచ్చమ్మ, మల్లేష్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


మోడల్ స్కూల్‌లో భోజనం రుచి చేస్తున్న ఎంపీడీఓ మల్‌రెడ్డి

అవుకు: విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం సుచి, రుచిగా ఉండేలా చూసుకోవాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం అవుకు సమీపంలోని మెట్టుపల్లె రహదారిలో ఉన్న ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. పిల్లలకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఎలాంటి వంట పదార్థాలను వాడుతున్నారో నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని తెలిపారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు


డేవిడ్ నగర్‌లో ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

డోన్: సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు మున్సిపల్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయం చేసుకుని పనిచేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని కొత్తపేట, కేఈ కృష్ణమూర్తి నగర్, మాదన్న నగర్ ప్రాంతాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలన్నారు. మలేరియా, డెంగీ, డయేరియా లక్షణాలు ఉంటే సకాలంలో వైద్య చికిత్స చేయాలని సూచించారు. కమిషనర్ వెంట డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా ఉన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ సభ్యుడు రాధా స్వరూప్ మంగళవారం భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రోటరీ క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సభ్యులు విజయ నాగరాజు, సత్తార్, మాణిక్యం, వీర భద్రారెడ్డి, గణేష్ రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు

• సీనియర్ సివిల్ జడ్జి తంగమణి


పరుగు పందెంలో పోటీ పడుతున్న బాలికలు


విజేతలతో జడ్జి తంగమణి, ఎంఈఓ ప్రభాకర్

డోన్ టౌన్: క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తుతో పాటు గుర్తింపు లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూల్ ఆవరణలో డోన్, ప్యాపిలి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల బాలికలకు ఆటల పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. సమాజంలో అన్ని రంగాల్లో బాలికలు రాణించాలని.. ఇందుకు ఆర్‌డీటీ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి నైపుణ్యాలను చాటుకోవాలని సూచించారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగంచేసుకోవాలన్నారు. రెండు మండలాలకు చెందిన 12 పాఠశాలల క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 14, అండర్ 16 బాలికలకు రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఆర్‌డీటీ ఏరియా టీమ్ లీడర్ నాగభూషణం, ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

38 పనులకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం

• కూరగాయల మార్కెట్‌లో అదనపు కట్టల నిర్మాణం
• సచివాలయాల అద్దె చెల్లింపు
• మార్కెట్ నిర్వహణ టెండర్లకు ఆమోదం
• డోన్ మున్సిపల్ సమావేశంలో నిర్ణయం


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: నంద్యాల జిల్లా డోన్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాధాసీదాగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ పరిధిలోని 38 అంశాలకు సంబంధించి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. స్థానిక కూరగాయల మార్కెట్‌లో అదనంగా నాలుగు కట్టలను నిర్మించి వ్యాపారులకు కేటాయించడంతో పాటు పాత మార్కెట్‌లో గదులు కలిగి ఉండి మృతి చెందిన కుటుంబీకులకు తిరిగి కొత్త మార్కెట్‌లో గదులు కేటాయించేందుకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కొత్తపేటలో అన్న క్యాంటీన్ నిర్మాణం, నిర్వహణకు నిధులు కేటాయించేందకు సభ్యులు ఆమోదం తలిపినట్లు కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. స్థానిక యోగా సెంటర్‌లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు సభ్యులు ఈ అంశాన్ని కూడా ఆమోదించినట్లు తెలిపారు. పట్టణంలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సచివాలయాలకు విద్యుత్ బకాయిలు, అద్దెలను చెల్లించేందుకు సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దిన, వార మార్కెట్ నిర్వహణకు గురుస్వామి, వెంకట్రాముడు అనే ఇద్దరు మాత్రమే దాఖలు చేసిన రూ.12లక్షల విలువ గల టెండర్లను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, కౌన్సిలర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న డీఎస్పీ


అమ్మవారి ప్రసాదం స్వీకరిస్తున్న డీఎస్పీ రవీంద్రారెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని నంద్యాల డీఎస్పీ రవీంద్రారెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి కుంకుమార్చన, అభిషేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు, పూలమాలతో సత్కరించారు. ఆయన వెంట నందివర్గం ఎస్‌ఐ తిరుపాల్ ఉన్నారు.

డ్రైవర్ల సమ్మెకు హమాలీల మద్దతు


సంఘీభావం తెలుపుతున్న హమాలీలు

డోన్ టౌన్: లారీ డ్రైవర్లకు వేతనాలు పెంచడంలో లారీ యజమానులు మొండి వైఖరిని విడనాడాలని సీఐటీయూ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, నాగన్న, కోశాధికారి నాగమద్దయ్య అన్నారు. మంగళవారం కోట్ల వారిపల్లెలోని సీఐటీయూ కార్యాలయంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లారీ డ్రైవర్లు 8 రోజులుగా సమ్మె చేస్తున్నా సమస్యలు పరిష్కరించకుండా యజమానులు మొండి వైఖరి అవలంభిస్తున్నారని ఆక్షేపించారు. ఇప్పటికైనా చర్చలు జరిపి ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే హమాలీల మద్దతుతో పాటు ఫ్యాక్టరీ కార్మికులు, సున్నం బట్టీ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెకు సిద్ధమవుతారని పేర్కొన్నారు. సమావేశంలో హమాలీ యూనియన్ కార్యదర్శి మధునాయుడు, ఉపాధ్యక్షుడు ఎల్లనాయుడు, కోశాధికారి శ్రీను, నాయకులు సోమశేఖర్, నరసింహుడు, గోపాల్ పాల్గొన్నారు.

అవుకు రిజార్వాయర్‌కు కృష్ణా జలాలు

• రేపటి నుంచి ఆయకట్టుకు సాగునీరు


ఎస్సార్‌బీసీ ద్వారా వస్తున్న నీరు

బనగానపల్లె: ఎస్సార్‌బీసీ కాలువ ద్వారా కృష్ణా జలాలు మంగళవారం ఉదయం బనగానపల్లె మీదుగా అవుకు రిజార్వాయర్‌కు చేరుకుంది. ఈ కాల్వకు బనగానపల్లె, అవుకు, కొవెలకుంట్ల, సంజామల, పాణ్యం, నంద్యాల మండలాల పరిధిలోని 1.62 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ప్రధాన కాల్వకు అనుసంధానంగా ఉన్న బ్లాక్‌ల ద్వారా ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. వరి, మొక్కజొన్న, మిరప పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం 30 నుంచి 35 వేల ఎకరాల్లో వరి, 20–25 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 23–25 వేల ఎకరాల్లో మిరప, పత్తి పంటలను రైతులు సాగు చేస్తారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది 20 రోజుల ముందుగా ఆయకట్టుకు సాగునీరు అందుతుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే ఏడాదిలోగా ఇంటింటికీ తాగునీరు

• ఎమ్మెల్యే కోట్ల వెల్లడి

డోన్: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వచ్చే ఏడాది చివరి కల్లా శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పాతపేట శ్రీరాముల దేవాలయం ప్రాంతంలో ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారుల మధ్యలో తాగునీటి పైపులైన్‌లు వేయడం వల్ల తరచూ మరమ్మతుల పేరుతో గుంతలు తీస్తుండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, నీరు సక్రమంగా రావడం లేదని కొందరు కోట్ల దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జయరాం, వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, మాజీ కౌన్సిలర్లు భారతి, కోట్రికె ఫణిరాజ్ తదితరులు ఉన్నారు.

పండ్లతోటలతో మంచి ఆదాయం


కానాల గ్రామంలో పనులను పరిశీస్తున్న ఎంపీడీఓ

సంజామల: పండ్లతోటలతో మంచి ఆదాయం పొందవచ్చని.. రైతులు ఆ దిశగా ఆసక్తి చూపాలని ఎంపీడీఓ విజయకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కానాల, గిద్దలూరు గ్రామాల్లో ఎన్‌ఆర్‌జీఎస్ నిధుల కింద పండ్ల మొక్కలు నాటుతున్న పొలాలను ఏపీఓ ప్రకాష్‌రావ్‌తో కలిసి పరిశీలించారు. పండ్లతోటలు నాటుకునే రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి

బనగానపల్లె రూరల్: కడుపు నొప్పితో ఆత్మహత్యకు యత్నించిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపాల్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సుశీలమ్మ(52) కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. పలు వైద్యశాలల్లో చూపించినా నయం కాకపోవడంతో మనస్థానంతో సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. మృతురాలి కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

నందివర్గం పోలీసుస్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన స్వప్న తన భర్త వేధింపులకు గురిచేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు. వివరాలు.. స్వప్నకు ముక్కమళ్ల గ్రామానికి చెందిన వెంకటరెడ్డితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వెంకటరెడ్డికి ఉద్యోగం పోవడంతో భార్యను పలు రకాలుగా వేధింపులకు గురి చేశాడు. దీంతో నాలుగేళ్ల నుంచి స్వప్న టంగుటూరు గ్రామంలోని పుట్టింటిలో ఉంటోంది. తనతో మాట్లాడాలని గ్రామానికి వచ్చి వేధింపులకు గురిచేశాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పకడ్బందీగా వ్యవసాయ గణన

బనగానపల్లె రూరల్: మండలంలో వ్యవసాయ గణనను సక్రమంగా చేపట్టాలని జిల్లా ఉపగణాంకాధికారి ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌ఓ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలో రెండో విడత ఎంపిక చేసిన గ్రామాలకు సంబంధించి వీఆర్‌ఓలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. 2021–22వ సంవత్సరానికి సంబంధించి ఎంపిక చేసిన గ్రామాల్లో వ్యవసాయ గణనను పూర్తి చేశామని..రెండో విడతలో భాగంగా మండలంలోని టంగుటూరు, కైప, పసుపల, యాగంటిపల్లె, భానుముక్కల, గులాంఅలియాబాద్, యనకండ్ల, నందివర్గం, చెరువుపల్లె గ్రామాల్లో నిర్వహించే వ్యవసాయ గణనను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో రైతులు, మహిళా రైతులు, విస్తీర్ణం, పంటల వివరాలు, దిగుబడి తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

అభివృద్ధి చేయడమే బుగ్గన చేసిన తప్పా?

• కొన్ని పత్రికలు పనిగట్టుకుని దుష్ప్రచారం
• వాస్తవాలు తెలుసుకోకుండా రాయడం సరికాదు
• బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి


మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: అభివృద్ధి పనులతో డోన్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై ఈనాడు పత్రికలో అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, ముర్తుజావలీ, రామ చంద్రుడు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటికి, పొలాలకు ప్రభుత్వ నిధులతో రహదారులు ఏర్పాటు చేసుకున్నారని నిజాలు తెలుసుకోకుండా పత్రికల్లో రాయడం భావ్యం కాదన్నారు. బుగ్గన తాత రావుబహదూర్ బీపీ శేషారెడ్డి ముందు చూపుతో పోలీస్ క్వార్టర్స్‌కు స్థలం కేటాయించారన్నారు. ఆ స్థలం నిరుపయోగంగా ఉండడంతో పోలీసుల విన్నపం మేరకు వ్యాపార సముదాయాల ఏర్పాటుతో పాటు రహదారి ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే బైటిపేట నాగులకట్ట నుంచి మదులకు వెళ్లే రైతుల పొలాలకు రహదారి ఏర్పాటు చేస్తే తన స్వార్థం కోసం వేసుకున్నారని పేర్కొనడం సిగ్గుచేటన్నారు. ఆ దారిలో ఆయనకు ఇల్లు, పొలం లేదని స్పష్టం చేశారు. పట్టణంలోని సత్రం వద్ద ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని బైటిపేట కళ్లాల సందుల్లో తన ఎకరన్నర పొలంలో కూడా డబుల్ రోడ్డు ఏర్పాటు చేసి ప్రజల ఇక్కట్లను తొలగించిన మాట వస్తవం కాదా అని ప్రశ్నించారు. పట్టణంలో నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేశారన్నారు. అభివృద్ధి కోసం రహదారులు నిర్మిస్తే వాటిని స్వార్థం కోసం వేసుకున్నారని అనడం ఎంత వరకు సమంజసం అన్నారు.

హామీలు ఏమయ్యాయి?

సూపర్ సిక్స్ పథకాలతో జీవితాలను మార్చేస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండు నెలలైనా ఊసెత్తడం లేదని విమర్శించారు. టీడీపీ నాయకుల మాటలను నమ్మి ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారని.. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఈ పాటికే అమ్మ ఒడి, రైతు భరోసా, ఇతర పథకాలు వచ్చేవని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజకీయ కక్షలు, అక్రమం మద్యం పెరిగిపోయాయన్నారు. వార్డు కౌన్సిలర్లు ఇబ్రహీమ్, చింతల నాగిరెడ్డి, కోట్ల మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, మురళీకృష్ణ, రుద్రవరం నారాయణ, ఖాజా, నాగేశ్వర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నాటుసారా స్వాధీనం

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె, సీతారామాపురం గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు. గూటుపల్లె గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న బాలరాజు, మద్దమ్మ, చాంద్‌బీ నుంచి 45 లీటర్లు, సీతారామాపురం గ్రామంలో మాదన్న వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెల్లడించారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ


పుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఎంఈఓ సోమశేఖర్ మంగళవారం పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న జాహ్నవిరెడ్డి

డోన్: ఏటా కొందరు నిరుపేద విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ముడియాల నాగభూషణంరెడ్డి, ప్యాపిలి జెడ్పీటీసీ సభ్యురాలు శైలజారెడ్డి దంపతులు ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు మద్దమ్మ, కార్యదర్శి శకుంతలా రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఇన్నర్‌వీల్‌క్లబ్ కార్యాలయంలో 6వ తరగతి విద్యార్థి చంద్రశేఖర్‌కు రూ.6వేల నగదును ముడియాల జాహ్నవి రెడ్డి అందజేశారు.


వీఆర్‌ఓలకు సూచనలు ఇస్తున్న జిల్లా ఉపగణాంకాధికారి

యువకుల మధ్య స్ట్రీట్ ఫైట్


దాడిలో గాయపడిన యువకుడు

డోన్ టౌన్: పట్టణంలో ఇటీవల కాలంలో గొడవలు ఎక్కువయ్యాయి. ఈనెల 27వ తేదీ పాత బస్టాండ్ సమీపంలోని వినాయక టెంపుల్ వద్ద యువకుల మధ్య జరిగిన స్ట్రీట్ ఫైట్ సంఘటన మరువక ముందే మంగళవారం తారకరామనగర్‌లో యువకులు పరస్పరం దాడి చేసుకున్నారు. ఇందులో ఓ యువకుడికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. గొడవకు పాల్పడిన వారి కోసం పట్టణ పోలీసులు గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఇటీవల కాలంలో పట్టణంలోని ప్రధాన రహదారుల్లో తరచూ యువకులు గొడవకు దిగుతుండడంతో పట్టణ వాసులు భయాందోళనకు గురవుతున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

డోన్ టౌన్: మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకొచ్చి డోన్‌లో విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణానికి చెందిన సికారి రాందాస్, రోహిత్‌తో పాటు డోన్ పట్టణంలోని పాతపేటకు చెందిన ఉరుకుంద పవన్, వడ్డే అర్జున్‌లను అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెల్లడించారు. పట్టణ సమీపంలోని యు.కొత్తపల్లె వై జంక్షన్ సమీపంలోని వేబ్రిడ్జి వద్ద పై వ్యక్తులు గంజాయితో ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశారన్నారు. నిందితులను అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి 1200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారన్నారు. వీరిని స్టేషన్‌కు తరలించి విచారించగా గుంతకల్లు పట్టణం సికారిగేరికి చెందిన పైన తెలిపిన ఇద్దరు మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు నేరం అంగీకరించారన్నారు. డోన్‌కు వచ్చి పాతపేటకు చెందిన ఉరుకుందు పవన్, వడ్డే అర్జున్‌లకు విక్రయిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

ధర్మమార్గంతో సమాజం సుభిక్షం

బనగానపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నిడిస్తే సమాజం సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉంటుందని టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం యనకండ్ల గ్రామంలోని శ్రీకృష్ణ మందిరంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

గురుకుల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

బేతంచెర్ల: నిబంధనల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ అబిదా బేగంను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంస్థ కార్యాలయంలో మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని.. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీలు


ఆకుమల్లలోని దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఉన్న నాలుగు ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సుంకలమ్మ ఫర్టిలైజర్స్‌లో సుమారు రూ.2 లక్షలు, చెన్నకేశవ దుకాణంలో రూ.2.70 లక్షలు విలువైన పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లడుతూ.. దుకాణ యజమానులు ప్రభుత్వం గుర్తింపు ఉన్న మందులనే విక్రయించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా మందులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్స్ మానస, నరేష్, దివ్య, అబ్దుల్, హరిరామ్, జిలాని, సురేంద్ర, సుమ ఉన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి

రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని సాధించాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి అన్నారు. కమలపురి సచివాలయ పరిధిలోని బొందలదిన్నె గ్రామంలో మంగళవారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. రైతులు మేలైన సాగు పద్ధతులను అలవాటు చేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందే విధానాలను రైతులకు వివరించారు. పొలం బడి కార్యక్రమంలో భాగంగా రైతులకు 14 వారాల పాటు ఉచితంగా తరగతులు నిర్వహిస్తామన్నారు. పొలం బడి ద్వారా పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్స్ జిలాని, దివ్య, మానస, అబ్దుల్, నరేష్, సుమ, సురేంద్ర పాల్గొన్నారు.

అక్రమ నిల్వలు ఉంచితే చర్యలు తప్పవు


ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ

అవుకు: ఎరువుల దుకాణాల్లో అక్రమ నిల్వలు ఉంచితే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి అబుల్ హక్ హెచ్చరించారు. అవుకు గ్రామంలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. దుకాణదారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిషేధించిన బయోపెస్టిసైడ్స్‌ను దుకాణాల్లో నిల్వ ఉంచడం, విక్రయాలు జరపడం చేస్తే దుకాణ లైసెన్స్‌లు రద్దు చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. పలు దుకాణాల్లో నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు.